క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిరూరల్: విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఎం.లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని సుందరయ్యనగర్, సుల్తానాబాద్, ఆలపాటి నగర్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



తెనాలిఅర్బన్: తెనాలికి చెందిన ఆర్ఎస్ చర్చి ఇండియా సంస్థ ఆధ్వర్యంలో భట్టిప్రోలు మండలం చింతమోటు గ్రామంలోని వరద బాధితులు 50మందికి మంగళవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ రెవరెండ్ పల్లె శామ్యూల్ మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదల వలన లంక గ్రామాల్లోని ప్రజలు సర్వం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారికి సహాయం చేయాలనే ఉద్దేశంతో వీటిని పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రోహి, ఝాన్సీ రాణి, జహీర్, జెహిర్ పాల్గొన్నారు.

రక్త దాతకు సర్టిఫికెట్ అందజేత

60వ సారి రక్తదానం చేసిన శివశంకర్



తెనాలిఅర్బన్: జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం పురస్కరించుకుని తెనాలి జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం సత్యం శివం సుందరం సామాజిక సేవా కేంద్రం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ 60వ సారి రక్తదానం చేశారు. అతడిని బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాధ అభినందించి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది మద్దిశెట్టి బాపనయ్య, రమా, శ్యామల, శ్రీను, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలపై అవగాహన ఉండాలి



తెనాలిఅర్బన్: ఉద్యోగ అవకాశాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని ఏపీ నాస్కమ్ సంస్థ రీజనల్ లీడ్ అకాడమిక్ ప్రతినిధి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ నాస్కమ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జేఎంజే కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రీయల్ స్కిల్స్, కెరీర్ అపర్చునిటీస్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు సుమియా అజీజ్, మణికంఠ గోపాల్, సుష్మ, సిజీదేవి, డాక్టర్ జి.సుధాకరయ్య పాల్గొన్నారు.

హెచ్ఐవీ నివారణపై మినీ కథల పోటీలు



తాడేపల్లిరూరల్: హెచ్ఐవీ వైరస్ నివారణపై అవగాహన మినీ కథల (తెలుగు) పోటీలను నిర్వహిస్తున్నట్లు మారుతీ మహిళా సొసైటీ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లక్కంరాజు సునీతారాజు అన్నారు. మంగళవారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ వైరస్ నివారణపై అవగాహన మినీ కథల పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు మారుతీ మహిళా సొసైటీ స్వచ్ఛంద సంస్థ తరపున ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతి రూ.3వేలు, మరియు మూడు ప్రోత్సాహక బహుతులు ఒక్కొక్కరికి రూ. 1,116లు మరియు ప్రశంసా పత్రాన్ని అందజేస్తామని తెలిపారు. పోటీలలో పాల్గొనే రచయితలు ఏ4 రెండు పేజీలు రాత ప్రతి మించకుండా ఈ పోటీ కోసమే రాసిన కథను తమ పూర్తి చిరునామా, మొబైల్ నెంబర్ తెలుపుతూ అక్టోబర్ 30వ తేదీ లోపు లక్కంరాజు సునీతా రాజు, డైరెక్టర్, మారుతీ మహిళా సొసైటీ, నులకపేట, తాడేపల్లి, గుంటూరు జిల్లా అడ్రస్‌కు పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 9573939766 నెంబరులో సంప్రదించాలన్నారు. పోటీ ఫలితాలను నవంబర్ 23వ తేదీన ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టు మేనేజర్ పి.గంగా భవాని, ఇ.ప్రత్యూష, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు భరోసా

- జిల్లా వైద్యశాలలో పీపీపీ పద్ధతిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ వార్డు
- ఎనిమిదేళ్లగా వైద్యశాలలో సేవలు



డయాలసిస్ సేవలు పొందుతున్న రోగులు

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో పీపీపీ(పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్)లో ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్ సేవలు పెరుగుతున్నాయి. కిడ్నీ సమస్యతో బాధపడే వారికి ఇక్కడ నెలలో రెండు రోజులు నెఫ్రాలజిస్ట్ వైద్య సేవలు అందించటంతో పాటు రోగులకు డయాలసిస్ చేస్తుంటారు. దీంతో తెనాలి డివిజన్ పరిధిలోని కిడ్నీ సంబంధ సమస్యలతో బాధపడేవారికి ఇది భరోసా ఇస్తోంది. తెనాలి జిల్లా వైద్యశాలలో నెఫ్రో కేర్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో డయాలసిస్ యూనిట్‌ను 2016 ఆగస్టు 26న ప్రారంభించారు. దీనిలో పది పడకలు ఉన్నాయి. వీటిలో మూడు పడకలను గ్లాస్ చాంబర్‌లో ఏర్పాటు చేశారు. ఇన్‌ఫెక్షన్ ఉన్న వారికి దీనిలో సేవలు అందిస్తున్నారు. నెలకు సగటున 54 మందికి 650 నుంచి 700 సెషన్స్ చేస్తుంటారు. ఇప్పటి వరకు 350 నుంచి 400 మందికి వైద్య సేవలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఒక్కో రోగికి నాలుగు గంటల పాటు డయాలసిస్ చేస్తున్నారు. సెలవు దినాలు మినహా మిగిలిన రోజులలో ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇక్కడ వైద్య సేవలు అందిస్తుంటారు.

వైద్యుల పర్యవేక్షణలో డయాలసిస్

తెనాలి జిల్లా వైద్యశాలలో డయాలసిస్ వార్డు ఏర్పాటు చేసిన సమయంలో టెక్నీషియన్‌లు డయాలసిస్ చేస్తుండేవారు. అవసరమైన సందర్భంలో వైద్యశాలలో పనిచేసే ఫిజిషియన్‌ల సేవలు ఉపయోగించుకునేవారు. రోగల సంఖ్య పెరుగుతుండటంతో నెఫ్రో సంస్థ ప్రతినిధులు ఒక వైద్యుడ్ని ఏర్పాటు చేశారు. ప్రతిరోజు సదరు వైద్యుని పర్యవేక్షణలో డయాలసిస్ చేస్తున్నారు. అలాగే గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో పనిచేసే నెఫ్రాలజిస్ట్ వైద్యులు డాక్టర్ అస్లాం నెలకు రెండు సార్లు వచ్చి ఇక్కడ వైద్యసేవలు అందిస్తున్నారు. వీరితో పాటు డయాలసిస్ వార్డులో మేనేజర్-1, టెక్నిషియన్‌లు-2, స్టాఫ్ నర్సులు-6, క్వాలిటీ మేనేజర్-1 ఉంటారు. కిడ్నీ సమస్యతో బాధపడేవారికి జిల్లా వైద్యశాలలోని ల్యాబ్‌లో పరీక్షలు చేయిస్తుంటారు. అక్కడ అందుబాటులో లేకుంటే ప్రైవేట్ ల్యాబ్ లలో చేయించుకోవాల్సి ఉంటుంది.

డయాలసిస్ సేవలను ఉపయోగించుకోవాలి



తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్ సేవలను రోగులు ఉపయోగించుకోవాలి. ఇక్కడ డయాలసిస్‌కు సంబంధించిన అన్ని రకాల పరీక్షలు చేయటంతో పాటు అవసరమైన చికిత్సను ఉచితంగా అందిస్తున్నాం. ఈ సేవలను తెనాలి డివిజన్ పరిధిలోని రోగులు ఉపయోగించుకోవాలి.

–డాక్టర్ సౌభాగ్యవాణి, సూపరింటిండెంట్, జిల్లా వైద్యశాల, తెనాలి

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుదాం..

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక
- 'స్వచ్ఛతా హి సేవ' విజయవంతం చేయండి



బస్టాండ్ ఆవరణను శుభ్రం చేస్తున్న డీఎం రాజశేఖర్



ర్యాలీలో చైర్‌పర్సన్ రాధిక, వైస్‌చైర్మన్ హరిప్రసాద్, కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తెనాలి పట్టణంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవ 2024 కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న పిలుపునిచ్చారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ తెనాలి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మంగళవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి రోజు పట్టణంలోని వివిధ వార్డులలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు, స్పెషల్ డ్రైవ్ కింద నిర్వహిస్తున్నట్లు వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ మురుగు కాలువలను బాగు చేయడం, వ్యర్థాలను తొలగించడం, కాల్వల్లో ఫాగింగ్, స్ప్రెయింగ్ వంటివి చేయించడం, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవడం వంటివి చేయనున్నట్లు చెప్పారు. ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ గంగానమ్మపేట, సాయిబాబా గుడి మీదుగా రైల్వేస్టేషన్ వరకు చేరింది. అక్కడ రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, మొగల్ అహ్మద్‌బేగ్, గొడవర్తి శ్రీ సాయి హరేరామ్, మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, రైల్వేస్టేషన్ మేనేజర్ టి.వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రామచంద్రరావు, ప్రసాద్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, మున్సిపల్, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

+ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా తెనాలి ఆర్టీసీ డిపోలోని గ్యారేజ్ పరిసర ప్రాంతాలను మంగళవారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

సినిమాపై కేబినెట్‌లో చర్చ అవసరం

- సబ్సిడీని పెంపుదల చేయాలి
- చలనచిత్ర అభివృద్ధి సంస్థను సాంస్కృతిక శాఖలో విలీనం చేయాలి
- మా–ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా

తెనాలి: రాష్ట్ర కేబినెట్ బుధవారం సమావేశమవుతున్న సందర్భంగా సినిమా పరిశ్రమపై ప్రతిపాదిత అంశాలపై చర్చించాల్సిందిగా మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. స్థానిక 'మా–ఏపీ' కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సినిమా పరిశ్రమ ఏపీలో అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థను సమాచారశాఖ నుంచి విడతీసి పర్యాటక, సాంస్కృతిక శాఖల్లో విలీనం చేస్తే ప్రయోజనం ఉంటుందని అభిప్రాయపడ్డారు. సినిమా షూటింగ్ లోకేషన్లన్నీ టూరిజం శాఖ పరిధిలోనే ఉన్నందున అనుమతులకు కాలయాపన జరగదన్నారు. గతంలో ప్రకటించిన నంది అవార్డులను అందజేస్తూ ప్రస్తుత కాలానికి నంది అవార్డులను ప్రకటించాలని కోరారు. రాజకీయాలతో సంబంధంలేని వ్యక్తులను న్యాయనిర్ణేతల కమిటీలో నియమించాలని సూచించారు. కొన్ని రాష్ట్రాల్లో సబ్సిడీ రూ.50 లక్షలు చెల్లిస్తున్న నేపథ్యంలో పెరిగిన సినిమా నిర్మాణ వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని, ఆంధ్రలో సబ్సిడీని రూ.10 లక్షల్నుంచి రూ.50 లక్షలకు పెంచే దిశగా నిర్ణయం తీసుకోవాలని యూనియన్ తరపున కోరారు. స్టూడియోల నిర్మాణం, పోస్ట్ ప్రొడక్షన్ యూనిట్ల ఏర్పాటుపైనా ఆలోచన చేయాలన్నారు. పర్యాటక, సాంస్కృతిక, ఎఫ్‌డీసీ శాఖల్లో ఖాళీలను భర్తీచేయాలని కోరారు.

భవిష్యత్‌లో ఉద్యోగావకాశాలు



'నాస్కామ్', జెనపాక్ట్ ప్రతినిధులతో డాక్టర్ రామ్‌చంద్ విద్యార్థులు

తెనాలి: 'ఐటీ–బిజినెస్ ప్రాసెస్ మేనేజ్మెంట్, నైపుణ్యాలు, ఉద్యోగావకాశాలు' అనే అంశంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో మంగళవారం డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులకు నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కామ్) ప్రతినిధులు, మల్టీ నేషనల్ కంపెనీ 'జెనపాక్ట్' ప్రతినిధులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. 'జెనపాక్ట్' అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ సుమియా అజీజ్ మాట్లాడుతూ కంపెనీలో ఉన్న ఉద్యోగావకాశాలు వివరించారు. అంతర్జాతీయంగా తమ కంపెనీలో ఉద్యోగావకాశాలు, వాటికి అవసరమైన నైపుణ్యాలను వివరించారు. 'నాస్కామ్' ఆంధ్రప్రదేశ్ రిలేషన్స్ అధికారి బి.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, భారత ప్రభుత్వం ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ అనే ప్లాటుఫాం ద్వారా డిగ్రీ విద్యార్థులకు అందిస్తున్న ఆన్‌లైన్ కోర్సులను వివరించారు. భవిష్యత్‌లో ఉద్యోగావకాశాలు చాలా రానున్నాయని చెప్పారు. అందుకు తగినట్టుగా విద్యార్థులు అకడమిక్ చదువుతోపాటు ఆన్‌లైన్ కోర్సులను పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఎస్‌డీసీ ప్రతినిధి గోపి, డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు పాల్గొన్నారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ పర్యవేక్షించారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి

ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు



అధికారి శాంతిశ్రీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: ఇటీవల కురిసిన అధికవర్షాల కారణంగా పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు అన్నారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరులో రైతు, కౌలు రైతు సంఘం నాయకులతో కలసి రైతు భరోసా కేంద్రం అధికారి శాంతిశ్రీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జొన్న శివశంకరరావు మాట్లాడుతూ ఆగస్టు నెల చివరిలో కురిసిన అధిక వర్షాలకు చిర్రావూరు గ్రామంలోని రైతులు, కౌలు రైతులు, పాడిరైతులు విపరీతంగా నష్టపోయారని అన్నారు. గ్రామ పరిధిలోని లంక పొలాలలో వ్యవసాయ పంటలు పూర్తిగా నీటమునిగి, సేద్యం చేసే రైతన్నకు కన్నీరే మిగిలిందన్నారు. చిర్రావూరు గ్రామానికి చెందిన 10 పాడి పశువులు కృష్ణానది వరదలలో కొట్టుకుపోయాయని అన్నారు. లంక పొలాల్లో సుమారు 25 ఎకరాల్లో డ్రిప్ పైపులు పనికిరాకుండా పాడయ్యాయని అన్నారు. పంట నష్టపోయిన రైతులకు పసుపు, కూరగాయ పంటలకు ఎకరానికి రూ.25 వేలు, కంద పంటకు ఎకరానికి రూ.లక్ష, పాడైపోయిన డ్రిప్ పైపుల రైతులకు కొత్త డ్రిప్ పైపులను ప్రభుత్వం అందజేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, మేడూరి పాములు, శంకర్, కౌలు రైతు సంఘం నాయకులు పల్లపాటి సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల నాయకులు పరిమిశెట్టి శివనాగేశ్వరరావు, వేణు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేకాటాడుతున్న 8 మంది అరెస్ట్

కొల్లిపర: మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలో పొలాల్లో ఒక భవనంలో రహస్యంగా పేకాటాడుతున్న 8 మందిని ఎస్ఐ పి.కోటేశ్వరరావు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేకాటాడుతున్న 8 మంది వద్ద నుంచి రూ.15,220, 4 మోటార్ సైకిల్‌లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వెంట నాగరాజు, తాతారావు ఉన్నారు.

చోరీలకు పాల్పడుతున్న యువకుల అరెస్ట్

తెనాలిరూరల్: వరస చోరీలకు పాల్పడుతున్న యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో చోరీ కేసుల వివరాలను ఎస్ఐ షేక్ కరిముల్లా వివరించారు. వేర్వేరు కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసి వీరి వద్ద నుంచి రూ. 2.80 లక్షల విలువ చేసే 45గ్రాముల బంగారం ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టణానికి చెందిన ఒడగల పార్థసారథి అలియాస్ పార్థు చోరీలు చేస్తుంటాడు. తన స్నేహితులు కూరపాటి సంపత్, ధనావత్ హనుమనాయక్‌లతో కలసి ఇటీవలి కాలంలో చోరీలకు పాల్పడుతున్నాడు. పట్టణ చినరావూరుకు చెందిన వెంకటవాసు జూలై 11వ తేదీన అర్ధరాత్రి సమయంలో బహిర్భూమికని బయటకు రాగా అతడిని బెదిరించి మెడలో ఉన్న రెండు బంగారు గొలుసులు, చేతికి ఉన్న రెండు ఉంగరాలను నిందితులు చోరీ చేసినట్లు తెలిపారు. అలానే నాజరుపేటకు చెందిన కాంతి శ్రీరామ్ ఇంట్లో నిద్రిస్తుండగా లోనికి ప్రవేశించిన వీరు బీరువాలో ఉన్న రెండు బుట్ట పోగులు అపహరించుకెళ్లారు. చెంచుపేట కెప్టెన్ యర్రంనేని విజయప్రసాద్ బజారులో వృద్ధురాలి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఆయా ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులను బుర్రిపాలెం రోడ్డులోని పొలాద్రి కాలువ వద్ద అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కరిముల్లా తెలిపారు.

ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం

తాడికొండ: నైట్‌హాల్ట్‌లో ఆగిన ఆర్టీసీ బస్సు అద్దాలను ధ్వంసం చేసిన ఘటన తాడికొండ మండలం ముక్కామల గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాల ప్రకారం ముక్కామలకు చెందినవారు మనుషులు ఎక్కకుండానే గుంటూరులో బస్సు బయలుదేరే సమయంలో లగేజీ వేశారు. అయితే గ్రామంలో ఆ లగేజీ దించుకొంటుండగా.. ఇలా అయితే మా ఉద్యోగాలకు ఇబ్బంది.. మనుషులు ఎక్కకుండా లగేజీ ఎందుకు వేశారు అని కండక్టర్ ప్రశ్నించడంతో ఆవేశానికి గురైన సుధాకర్ అనే వ్యక్తి బస్సు అద్దాలు పగలగొట్టి పారిపోయాడు. దీనిపై బస్సు డ్రైవర్, కండక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించి కేసు నమోదు చేయనున్నట్లు సీఐ వాసు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం



జీవామృతం తయారీపై రైతులకు వివరిస్తున్న విద్యార్థులు

వల్లభాపురం(కొల్లిపర): రైతులు ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తే, తక్కువ పెట్టుబడితో పాటు అధిక దిగుబడులు సాధించటమే కాకుండా ఆహార ధాన్యాలు ఎంతో ఆరోగ్యకరంగా ఉంటాయని వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయం విద్యార్థినులు రైతులకు వివరించారు. వ్యవసాయ, ఉద్యాన విజ్ఞాన విభాగం ద్వారా 2024–25 గ్రామీణ అవగాహన అనుభవ కార్యక్రమంలో భాగంగా విజ్ఞాన్ విశ్వవిద్యాలయం విద్యార్థులు మంగళవారం మండలంలోని వల్లభాపురంలోని రైతులకు మొక్కల పెంపకానికి సహజ పద్ధతులు, ధ్రువ జీవామృతం తయారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంట సాగు చేయడం వలన రసాయనాల వాడకం ఉండదని చెప్పారు. జీవామృతం కషాయాలపై రైతులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వివిధ పంటలో చీడపీడల నివారణకు జీవామృతం వినియోగించాలని సూచించారు. ధ్రువ జీవామృతం పంటల్లో జీవన ఎరువుగా వాడాలని చెప్పారు. జీవామృతాన్ని పాలు, పెరుగు, వేరుశనగ, గోవు మూత్రం వంటి సహజ పదార్థాలతో రైతులు తమ ఇంటి వద్దనే ఏ విధంగా తయారు చేసుకోవాలని అన్న విషయాలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం 4వ సంవత్సరం విద్యార్థినులు ఎస్.కావ్య శ్రీ, బీవీఎస్ కావ్య, బి.నక్షత్ర, ఎ.మధులత, ఎం.లోకేశ్వరి, వై.శ్రీహిత, అజ్మీరా, జమేరియా, ఎల్.హేమ, వి.తేజశ్రీ, రైతులు అద్దంకి వెంకటరమణ, నాగిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్



విద్యార్థినులకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేస్తున్న డాక్టర్ హెలెన్ నిర్మల, హెచ్ఎం రాజ్యలక్ష్మి

తెనాలిఅర్బన్: నులిపురుగులను నియంత్రించేందుకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ దోహదపడతాయని మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కమిషనర్ బండి శేషన్న ఆదేశాల మేరకు కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిరా మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ టాబ్లెట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగుల వలన రక్తహీనత ఏర్పాడే అవకాశం ఉందన్నారు. ఆరు నెలలకు ఒకసారి వీటిని వేసుకోవడం వలన రక్తహీనతను నియంత్రించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజ్యలక్ష్మి, ఆరోగ్య విస్తీరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఇన్‌చార్జి హెల్త్ విజిటర్ దాసరి విజయకుమారి, సిబ్బంది జవ్వాజి లక్ష్మీతులసీ, జంషద్ బేగం, ఎ.వెంకటేశ్వరరావు, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయంగా సుదర్శనహోమం

తెనాలి: స్థానిక షరాఫ్ బజార్‌లోని శ్రీసువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో వార్షిక పవిత్రోత్సవాలు, మహా సుదర్శనహోమం కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజైన మంగళవారం స్వామికి విశేష పూజలు, సుదర్శన హోమం, పవిత్ర ఆరోపణ, శాంతి హోమం నిర్వహించారు. బుధవారం పవిత్ర విసర్జన, పూర్ణాహుతి, తిరుప్పావడ సేవ పూజ జరుగుతాయని ఆలయ ఈఓ అవుతు శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని సూచించారు. శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య, ఆలయ వంశ పారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాస మూర్తి, కిరణ్ కుమార్, సురేష్, సంకీర్తన సేవాసమితి సభ్యులు గుడివాడ బాలకృష్ణ, మూర్తి వెంకటేశ్వరరావు, జంధ్యం రామారావు, మదుపల్లి చంద్రశేఖర్, కె.రమణ కుమార్ పాల్గొన్నారు.

రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఈఓ శిరీష

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రైతులు ప్రతి ఒక్కరు ఈ–కేవైసీ చేయించుకోవాలని దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారి పి.శిరీష అన్నారు. మంగళవారం దుగ్గిరాల గ్రామంలో ఈ–కేవైసీపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుగ్గిరాల మండలంలో పంట నమోదు చేసుకున్న ప్రతి ఒక్క రైతు తప్పని సరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని, ఈ–కేవైసీతోనే పంట నమోదు ప్రక్రియ పూర్తి అవుతుందని, కాబట్టి ప్రతి ఒక్క రైతు సంబంధిత రైతు సేవా కేంద్రాల వద్దకు ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ తీసుకు వెళ్లి ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 23వ తేదీతో గడువు ముగుస్తుందని ఆమె వివరించారు. రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతో స్వచ్ఛంగా ఉంచాలి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



అధికారులతో కార్యాలయం వద్ద ఊడుస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: పరిసరాల పరిశుభ్రతతో మన ఊరిని, రాష్ట్రాన్ని స్వచ్ఛంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. స్వచ్ఛతాహి సేవ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం జెడ్పీ అధికారులు, ఉద్యోగులతో కలిసి హెనీ క్రిస్టినా జెడ్పీ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. అనంతరం మానవహారాన్ని ఏర్పాటు చేసి, అందరితో ప్రతిజ్ఞ చేయించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఆవాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా మన ఊరు, మనరాష్ట్రం దేశాన్ని స్వచ్ఛభారత్‌గా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో జె.మోహన్‌రావు, అకౌంట్స్ అధికారి జి.శ్రీనివాసరావు, జెడ్పీ ఏవోలు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరియార్ చిరస్మరణీయుడు

తెనాలి: దేశంలో అణగారిన వర్గాల ప్రజలు ఆత్మగౌరవంతో జీవించేలా కృషి చేసిన పెరియార్ ఈవీ రామస్వామి నాయకర్ ప్రాతఃస్మరణీయుడుగా ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కొనియాడారు. పెరియార్ జయంతిని పురస్కరించకుని బుధవారం పెరియార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు కుర్రా శ్రీను అధ్యక్షత వహించారు. పెరియార్ జీవిత విశేషాలను, అణగారిన వర్గాలకు చేసిన సేవలను స్మరించుకున్నారు. అణగారిన వర్గాలు తమ మధ్య ఐక్యతను పెంచుకోవడం ద్వారా మాత్రమే రాజ్యాధికారం సాధించుకోగలుగుతారని పెరియార్ స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. ఆయన ఆశయాల సాధన కోసం, నేటి రాజకీయ వ్యవస్థలోని నాయకులు, ముఖ్యంగా యువతరం కృషి చేయాలని కోరారు. యువత రాజకీయాల్లో రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. యువతలో దేశాన్ని నడిపించే శక్తి ఉందని పేర్కొన్నారు. నారిశెట్టి గాంధీ, మేకల సునీల్, సతీష్, పోతురాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.